# కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- చొప్పదండి ఎమ్మెల్యే సత్యం
- పలు గ్రామాల్లో సెంటర్లు ప్రారంభం



డబ్బుతిమ్మాయిపల్లిలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, అదనపు కలెక్టర్ రాంబాబు

కొడిమ్యాల, అక్టోబర్ 20: రైతులు కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. ఆదివారం డబ్బుతిమ్మాయిపల్లి, రామ్‌సాగర్, హిమ్మత్‌రావుపేట, శనివారంపేట, తిర్మలాపూర్, కొడిమ్యాల, కొండాపూర్, రామకిష్టాపూర్, చెప్యాల, అప్పారావుపేట, నాచుపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాంబాబుతో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. ధాన్యానికి ప్రభుత్వం కామన్ ధర క్వింటాల్‌కు రూ.2,300, ఏ గ్రేడ్ రకానికి రూ.2,320 మద్దతు ధర చెల్లిస్తున్నదని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సెంటర్లలో రైతులకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, మండల వ్యవసాయాధికారి పర్లపల్లి జ్యోతి, ఏపీఎం రాజేశం, ఆర్ఐ కరుణాకర్, సింగిల్ విండో చైర్మన్లు మేన్నేని రాజనర్సింగరావు, పొలు రాజేందర్, ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం జీవన్‌రెడ్డి, నాయకులు చిలువేరి నారాయణగౌడ్, పిడుగు ప్రభాకర్‌రెడ్డి, సురకంటి ముత్యంరెడ్డి, సురుగు శ్రీనివాస్, గడ్డం చంద్రమోహన్‌రెడ్డి, గంగుల మల్లేశం, మల్లారెడ్డి, అంబటి తిరుమలేష్, గోల్కొండ రాజు ఉన్నారు.

# మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



చింతకుంట చెరువులో చేప పిల్లలను పోస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, అక్టోబర్ 20: మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని, వంద శాతం సబ్సిడీతో ఉచిత చేప పిల్లలు పంపిణీ చేస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో జగిత్యాలలోని చింతకుంట చెరువులో చేప పిల్లలను మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతితో కలిసి వదిలారు. అనంతరం మాట్లాడారు. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రితో కలిసి పనిచేస్తానని, అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతానని చెప్పారు. నియోజకవర్గంలో 155 చెరువులకు 20 లక్షల చేప పిల్లలను పంపిణీ చేస్తున్నామన్నారు. మత్స్య పారిశ్రామిక సంఘంలో మహిళలు భాగస్వామ్యం పెరగాలని ఆకాంక్షించారు. రూ.20 లక్షలతో రైతుబజార్‌లో చేపల మార్కెట్ అభివృద్ధి చేశామని, ఈ రోజు రైతు బజార్ హోల్‌సెల్ మార్కెట్‌కు అడ్డాగా మారిందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, జిల్లా సంఘం అధ్యక్షులు ప్రవీణ్, పట్టణసంఘం అధ్యక్షులు గుమ్ముల అంజయ్య, కౌన్సిలర్‌లు బాలే లత శంకర్, పద్మ పవన్, జుంభర్తీ రాజ్ కుమార్, పంబాల రాంకుమార్, క్యాదాసు నవీన్, పాక్స్ డైరెక్టర్ ఆరుముల్ల గంగారం, బాలముకుందం, శంకర్, రాజ్ కుమార్ ఉన్నారు.

# కాంగ్రెస్‌కు పాలన చేతకాదు

- గవర్నెన్స్ తెలియక అప్పుల రాష్ట్రమని అభాసుపాలు చేస్తరా..?
- రూ.97వేల కోట్లతో నీళ్లు ఎత్తిపోసే ప్రాజెక్టులు కడితే అవినీతి అని బద్నాం చేస్తరా..?
- 420 హామీలేమైనయో చెప్పాలి
- మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్, పక్కన మాజీ ఎమ్మెల్సీ నారదాసు, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాల టౌన్, అక్టోబర్ 20: కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలకు పాలన చేతకాక తెలంగాణను అప్పుల రాష్ట్రమని అభాసుపాలు చేస్తున్నారని మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ మండిపడ్డారు. ఆదివారం జగిత్యాలలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. 2014లో తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత యావత్ తెలంగాణ ప్రజలు రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌కు అధికారాన్ని అప్పగిస్తే, ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దారన్నారు. రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతున్నదని, గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్‌లో అభివృద్ధి చెందిన రాష్ట్రాల జాబితాలో ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ సంస్థలు చెప్పడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టారని, హామీలేమైనయో చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.97వేల కోట్లు ఖర్చు చేసి లక్షల ఎకరాలకు నీళ్లు తెస్తే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 30 కిలోమీటర్ల ముత్తెమంత మూసీ సుందరీకరణకు రూ.1.50లక్షల కోట్లు ఖర్చు చేస్తానంటున్నాడని, ఇదేం లెక్క..? అని ప్రశ్నించారు. జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మా పార్టీ కండువాతో గెలిచిన సంజయ్‌కుమార్‌ను తాను ఒకటే ప్రశిస్తున్నానన్నారు. తమ హయాంలో తెలంగాణను దేశంలోనే అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తే, ఏ విధంగా అప్పుల్లో కూరుకుపోయిందని మాట్లాడుతున్నారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలకు పరిపాలన చాతకాక తరచూ రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, పాలన కష్టమవుతున్నదని బుకాయిస్తున్న మాట వాస్తవం కాదా చెప్పాలన్నారు. వాస్తవానికి కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల జీడీపీతో పోల్చి చూస్తే మన అప్పులు చాలా తక్కువ అని, ఇవి తన లెక్కలు కాదని మోదీ ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చెబుతున్నదన్నారు. వచ్చే డిసెంబర్ 4 నాటికి కాంగ్రెస్ గద్దెనెక్కి ఏడాది పూర్తవుతుందని, గులాబీ శ్రేణులతో కలిసి తాము ఇల్లిల్లూ తిరిగి కాంగ్రెస్ చేసిన మోసాల గురించి ప్రజలకు చెబుతామన్నారు. వచ్చే ఎన్నికల నాటికి శాసనసభ నియోజకవర్గాలు ఇలా ఉండవని, అన్నీ డీలిమిటేషన్ అవుతాయని, కొత్త నియోజకవర్గాలు ఏర్పడతాయన్నారు. నూతన క్యాడర్‌ను లేపుతామని, వచ్చే పంచాయతీ రాజ్ వ్యవస్థలో పోటీ చేస్తామన్నారు. తాము తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తామని చెప్పి చేసి చూపించామని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి అన్నిరంగాల్లో తీర్చిదిద్దామని, రానున్న శాసనసభ నియోజకవర్గాల్లో పూర్తిగా గెలిచి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు తానొక్కటే చెబుతున్నానని, మూసీ సుందరీకరణకు రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేసే రేవంత్‌రెడ్డి కావాలా..? యావత్తు తెలంగాణ జిల్లాలకు గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టు, కృష్ణానదిపై పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు కట్టి లక్షలాది ఎకరాలకు నీళ్లు ఇచ్చి లక్షల కుటుంబాలను పైకి తీసుకువచ్చే కేసీఆర్ కావాలా..? ఆలోచించుకోవాలని సూచించారు.

### కష్టాల్లో వెన్నంటి ఉన్నోడే ప్రజా నాయకుడైతడు

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు చెప్పుకుంటున్నారని, కానీ జగిత్యాలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దిందే బీఆర్‌ఎస్ ప్రభుత్వమని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో జగిత్యాలను జిల్లాగా ఏర్పాటు చేసి, ఒక మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, రాష్ట్రంలో మరెక్కడా లేనవిధంగా 4500 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇచ్చిన మాట వాస్తవం కాదా చెప్పాలని ప్రశ్నించారు. ఇవన్నీ చేసిన గులాబీ కండువా ఆనాడు డాక్టర్ సంజయ్ మెడలో ఉన్నందునే రెండోసారి ప్రజలు గెలిపించారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వం కోల్పోతే పార్టీ మారుడేనా..? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌కుమార్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, మల్యాల మాజీ జడ్పీటీసీ రాంమోహన్‌రావు, వొల్లం మల్లేశం పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య

జగిత్యాల టౌన్, అక్టోబర్ 20: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినిపల్లి ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం జగిత్యాల గీతా గ్రంథాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులు తమ అత్యవసరాల కోసం దాచుకున్న జీపీఎఫ్, సంపాదిత సెలవు మొత్తాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సప్లిమెంటరీ వేతనాల బిల్లులు ఏడాదిగా మంజూరు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు ఐల్నేని నరేందర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి రామారావు, రాష్ట్ర బాధ్యులు ఎలిగేటి రాజేంద్రప్రసాద్, గుడిసె పూర్ణచందర్, గడ్డం మైపాల్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, నరసగౌడ్, లింగారెడ్డి, రమేష్, కొలుముల శ్రీనివాస్, జంగిలి గంగాధర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన విద్యావిధానంతో సమాజంలో మార్పులు

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి



ప్రైవేటు టీచర్లతో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి

జగిత్యాల, అక్టోబర్ 20: విద్యా వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఎంతగానో ఉందని, నూతన విద్యా విధానం ద్వారా సమాజంలో ఎన్నో మార్పులు వస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యారంగ అభివృద్ధికి తనవంతు తోడ్పాటునందిస్తానని, పట్టభద్రులకు అన్ని విధాలా చేయూతనిస్తానన్నారు. నిర్లక్ష్యానికి గురైనవర్గానికి తోడ్పాటు అందించి, వారి అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్నానని, ముఖ్యంగా ఉద్యోగాల కల్పనలో వారికి చేయూతనిస్తానని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్ నియోజకవర్గాల కేంద్రంగా ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తానన్నారు. గ్రంథాలయాలను ఈ-లైబ్రరీగా తీర్చిదిద్దుతానని, పాఠకులకు అన్ని వసతులు కల్పిస్తానని వివరించారు. జగిత్యాలలోని పొలాస విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాలు మెరుగు పరిచేందుకు కృషి చేయడంతో పాటు కొండగట్టు జేఎన్టీయూ కళాశాలకు విశ్వవిద్యాలయం హోదా వచ్చేందుకు ప్రయత్నిస్తానన్నారు. తాను గెలిస్తే డిగ్రీ కళాశాలల యాజమాన్యాలకు బకాయిగా ఉన్న మూడేండ్ల ఉపకార వేతనాలు విడుదల చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కోరుట్లలోని పశువైద్య విశ్వవిద్యాలయంలో సౌకర్యాలు మెరుగుపరుస్తానని, జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆత్మీయ సమ్మేళనంలో రామకృష్ణ విద్యా సంస్థల కరస్పాండెంట్ రామకృష్ణ, నలందా విద్యా సంస్థల కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్, వీ రవీందర్ రెడ్డి, వేణు, వి సతీష్ కుమార్, టీపీడీఎంఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

# 'శ్రీనివాసుల' ఆత్మీయ సమ్మేళనం



టవర్ సర్కిల్ నుంచి ర్యాలీగా వెళ్తున్న శ్రీనివాసులు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 20: జగిత్యాల జిల్లాలో శ్రీనివాస్ పేరున్న వారందరూ ఒక్కచోట చేరారు. 1024 మంది వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడి, ఆదివారం ఆత్మీయ జిల్లా కేంద్రంలోని వర్తక సంఘంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా 'జై శ్రీనివాస్.. జై శ్రీనివాస్.. ఓం నమో వెంకటేశాయా' అంటూ నినదిస్తూ టవర్ సర్కిల్ నుంచి పాత మార్కెట్ వేంకటేశ్వర ఆలయం దాకా ర్యాలీగా వచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రూప్ అడ్మిన్ పిట్టల శ్రీనివాస్, సుమారు 200 మంది శ్రీనివాసులు పాల్గొన్నారు.




# బిల్లుల భారం తగ్గేదెలా?

## క్రెడిట్ కార్డ్ బకాయిల చెల్లింపులకు దారులివీ..

**క్రెడిట్** కార్డుల్ని సవ్యంగా వినియోగిస్తే వాటితో ఎన్నో లాభాలుంటాయి. ఆర్థిక పరిస్థితుల నిర్వహణలో వీటి పాత్ర ఎంతో ప్రభావవంతం. కానీ దురదృష్టవశాత్తూ చాలామంది ఈ క్రెడిట్ కార్డుల వాడకంతో మితిమీరిన ఖర్చుల వలయంలో చిక్కుకుంటున్నారు. ఈ క్రమంలోనే బిల్లులను చెల్లించలేని దుస్థితికి చేరుకుంటున్నారు. అయితే భారమైన క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపులకు కొన్ని మార్గాలున్నాయి. వాటిలో..

### ఈఎంఐల్లోకి మార్చడం


చాలా క్రెడిట్ కార్డు సంస్థలు బకాయిలను ఈఎంఐల్లోకి మార్చుకునే సౌకర్యం వినియోగదారులకు ఇస్తున్నాయి. నిజానికి మెజారిటీ బ్యాంకులు ఈ సదుపాయాన్ని ఉచితంగానే కార్డుదారులకు అందిస్తున్నాయి. దీనివల్ల ఒకేసారి పెద్ద మొత్తంలో నగదును సమకూర్చుకునే భారం తప్పుతుంది. అయితే క్రెడిట్ కార్డు బిల్లులను ఈఎంఐల్లోకి మార్చుకునే ముందు కనిపించని చార్జీలు ఏమైనా ఉన్నాయా?, ప్రాసెసింగ్ ఫీజులుంటాయా? అన్నది జాగ్రత్తగా చూసుకోవడం మంచిది.


### బిల్లింగ్ విధానంపై అవగాహన

క్రెడిట్ కార్డు వినియోగదారులు తప్పక తమ క్రెడిట్ కార్డ్ బిల్లింగ్ సైకిల్‌ను తెలుసుకోవాలి. బ్యాంకులు క్రెడిట్-ఫ్రీ పీరియడ్‌ను కల్పిస్తాయి. ఇందులో బకాయిల చెల్లింపునకు 30 రోజుల స్టేట్‌మెంట్ సైకిల్, దానిపై 15 రోజుల గ్రేస్ పీరియడ్ ఉంటాయి. ప్రతి నెలా బిల్లింగ్ సైకిల్ ఏ తేదీన మొదలవుతుందో చూసుకోవాలి. ఆ తేదీ తర్వాత కొంటే మనకు పేమెంట్‌కు ఎక్కువ సమయం ఉంటుంది. ఉదాహరణకు మీ క్రెడిట్ కార్డు బిల్లు డ్యూ డేట్ ఆగస్టు 4న ఉన్నది. ఆ బిల్లు స్టేట్‌మెంట్ జూలై 18న వచ్చింది. అయితే జూలై 19న మీరు మీ క్రెడిట్ కార్డు ద్వారా ఓ వస్తువును కొన్నారు. అప్పుడు అది తర్వాతి బిల్లు స్టేట్‌మెంట్‌లో ఉంటుంది. దాన్నిబట్టి సెప్టెంబర్ 4వరకు మీరు దాని చెల్లింపునకు వ్యవధి ఉంటుందన్నమాట. ఒకవేళ జూలై 17న కొంటే ఆగస్టు 4కల్లా చెల్లించాల్సిందే. రెండ్రోజులు ఆగి కొనడం వల్ల ఇంత లాభం ఉంటుంది. సమయం ఎక్కువగా ఉండటం వల్ల నగదు సర్దుబాటుకు వీలుంటుంది.

### పర్సనల్ లోన్

క్రెడిట్ కార్డు బకాయిలపై పడే వడ్డీ రేటు కన్నా.. వ్యక్తిగత రుణాలపై పడే వడ్డీ రేటు తక్కువ. కాబట్టి ఎక్కువగా ఉన్న క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లించేందుకు పర్సనల్ లోన్ల సహాయం తీసుకోండి. మీ క్రెడిట్ స్కోర్ బాగుంటే వడ్డీరేటు ఇంకా తగ్గుతుంది. అలాగే మినిమం కంటే ఎక్కువగా క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లిస్తే మంచిది. అధిక వడ్డీ బకాయిలను ముందుగా చెల్లించాలి. తక్కువ మొత్తాలను తీర్చడానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. అంతకన్నా ముందు అనవసరపు కొనుగోళ్లను తగ్గిస్తే బిల్లుల భారం తగ్గుతుంది.





# రిటైర్మెంట్ ప్లానింగ్ ఇలా..

**రిటైర్మెంట్** కోసం పెట్టుబడులు పెడుతున్నప్పుడు ద్రవ్యోల్బణం ప్రభావాన్ని పరిశీలించడం చాలాచాలా ముఖ్యం. భవిష్యత్తులో ఆయా వస్తూత్పత్తులు, సేవల ధరల్లో చోటుచేసుకునే పెరుగుదలనే ఈ ద్రవ్యోల్బణం సూచిస్తుంది. ఒకవేళ దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా రిటైర్మెంట్ పెట్టుబడులు పెట్టినట్టైతే ఆ వచ్చే సొమ్ము పెరిగిన ధరలకే పోతుంది తప్ప.. మీ అవసరాలకు మాత్రం చాలదు. దీనివల్ల మీ పదవీ విరమణ అనంతరం జీవితం కూడా ఆశించిన స్థాయిలో ఆనందంగా ఉండదు. అందుకే ఇప్పటి ద్రవ్యోల్బణం స్థాయి, అప్పటి ద్రవ్యోల్బణం లెక్కల్ని అంచనా వేసి, దానికి తగ్గట్టుగానే పెట్టుబడులకు వెళ్తే లాభదాయకం.

### పొదుపుపై ధరల దెబ్బ

రిటైర్మెంట్ సేవింగ్స్‌పై ద్రవ్యోల్బణం ప్రభావం నిజంగా చెప్పాలంటే చాలా ఎక్కువే. ఎంతోమంది వృద్ధులు వారి పెన్షన్, రిటైర్మెంట్ ఫండ్స్‌పైనే ఆధారపడి జీవిస్తూంటారు. అయితే పెరిగే ధరలు వారి రిటైర్మెంట్ సేవింగ్స్ వాస్తవ విలువ క్షీణతకు దారితీస్తాయి. దేశంలో ద్రవ్యోల్బణం హెచ్చుతగ్గులు.. సాధారణ వ్యక్తులు, వేతన జీవులనే అధికంగా ప్రభావితం చేస్తుంటాయి. పదవీ విరమణ అనంతరం పెన్షన్ ఆదాయంపై జీవించేవారికీ ద్రవ్యోల్బణం కష్టాలు తప్పవు. అందువల్ల కాబట్టి ముందుగానే ద్రవ్యోల్బణం అంచనాలతో పెట్టుబడులకు దిగితే ఆ ఇబ్బందులను వృద్ధాప్యంలో అధిగమించవచ్చు. లేకపోతే చాలీచాలని ఆదాయంతో సమస్యల్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది.

### ఇదీ సంగతి..

రిటైర్మెంట్ సేవింగ్స్‌ను ద్రవ్యోల్బణం ఏవిధంగా ప్రభావితం చేస్తుందో చూద్దాం. ఉదాహరణకు.. నేడు మీ ఖర్చులు రూ.5,000లుగా ఉన్నాయి. అయితే 6 శాతం ద్రవ్యోల్బణం ప్రభావంతో భవిష్యత్తులో ఈ ఖర్చు రూ.5,300లకు పెరిగిందనుకుంటే, వచ్చే 30 ఏండ్లలో.. అది దాదాపు రూ.28,700లను తాకగలదు. దీన్నిబట్టి ఒక్కసారి ఆలోచించండి.. మీరు ఈరోజు బాగానే పొదుపు చేస్తున్నామనుకుంటున్న మొత్తాలు, అప్పటికి ఎంతమేరకు మీ ఖర్చుల్ని భరించగలవోనని.

### అధిక నిధి ఎలా?

ద్రవ్యోల్బణం ప్రభావం నుంచి మీ రిటైర్మెంట్ ఫండ్స్ రక్షణకు ఈ విధంగా ప్రయత్నించవచ్చని కొందరు నిపుణులు సలహా ఇస్తున్నారు. వాటి ప్రకారం..

### ఈక్విటీల్లో పెట్టుబడులు

ద్రవ్యోల్బణాన్ని మించి ఆకర్షణీయ రాబడులను అందుకోవాలంటే.. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులను పరిశీలించడం ఉత్తమం. దీర్ఘకాలంలో పెద్ద ఎత్తున ఆదాయం లేదా లాభాలను పొందాలంటే ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సరి అని చెప్పవచ్చు. నిజానికి స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. అయితే షార్ట్-టర్మ్ ఇన్వెస్టర్లకే ఈ రిస్క్ ఉంటుందని కూడా గుర్తుంచుకోవాలి. రోజూ చూస్తున్న ఒడిదొడుకులు వీరినే ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. లాంగ్-టర్మ్ ఇన్వెస్టర్లకు ఇది తక్కువే. అందుకే స్వల్పకాల లక్ష్యాలతో ఈక్విటీల్లో పెట్టుబడులకు దిగవద్దు. అందుకు భిన్నంగా ముందుకెళ్తే.. ద్రవ్యోల్బణాన్ని మేనేజ్ చేసే ఆకర్షణీయ రిటర్న్స్‌ను సొంతం చేసుకోవచ్చు. ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకున్నట్టైతే మరింతగా సత్ఫలితాలుంటాయి.

### పెట్టుబడుల వర్గీకరణ

పెట్టుబడుల వర్గీకరణ వాటికున్న రిస్కుల్ని తగ్గించగలదు. అందుకే మీ పోర్ట్‌ఫోలియోలో రకరకాల పెట్టుబడి సాధనాలను చేర్చుకోండి. నిపుణుల సూచనల ప్రకారం.. స్టాక్స్‌లో 30 శాతం, బాండ్లలో 30 శాతం, రియల్ ఎస్టేట్‌లో 30 శాతం, నగదు-బంగారంపై మిగతా 10 శాతం పెట్టుబడులు పెడితే లాభదాయకంగా ఉంటుంది. ఇలా చేస్తే ఆయా రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చు. ఒక ట్రెండు రంగాల్లో నష్టాలు వాటిల్లినా.. మిగతా రంగాల్లోని లాభాలతో వాటిని భర్తీ చేసుకోవచ్చు. ముఖ్యంగా అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు ఈ పెట్టుబడులు కలిసొస్తాయి. అందుకే ఒకే రంగంపై దృష్టి పెడుతూ అందులోనే మొత్తం సొమ్మును పెట్టుబడిగా పెడితే పెద్దగా వృద్ధికి ఆస్కారం ఉండదు. పైగా సదరు రంగం కుదేలైతే మనమూ మునిగిపోతాం.

## ద్రవ్యోల్బణం ప్రభావాన్ని మరువద్దు

### ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లు

ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నప్పుడు స్వల్పకాలంలో మంచి రాబడులను అందుకోవడానికి ఈ ఫండ్లు చక్కగా దోహదం చేయగలవు. సాధారణంగా ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటే, వడ్డీరేట్లూ ఎక్కువగానే ఉంటాయి. ధరల్ని అదుపు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపోరేటును పెంచేస్తుంది. దీనివల్ల బ్యాంకుల రుణాలపై వడ్డీరేట్లూ పెరుగుతాయి. ఈ నేపథ్యంలోనే ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లు లాభదాయకం. కాబట్టి ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదవుతున్నప్పుడు ఈ ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లకు దిగితే అదనపు ఆదాయం అందుకోవచ్చు.

### గుర్తుంచుకోండి

ధరలు పెరుగుతున్నప్పుడు రోజువారీ అవసరాల కోసం పెట్టే ఖర్చులూ పెరుగుతూపోతుంటాయి. దీనివల్ల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతూ ఉంటుంది. కనుక ప్రతీ నెలా ఖర్చులు ఏవి? అన్నదానిపై స్పష్టత ఉంచుకుంటే ఎక్కడ అదనపు ఖర్చులుంటున్నాయో గుర్తించవచ్చు. అలాగే మ్యూచువల్ ఫండ్స్, సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల ద్వారా కూడా పెట్టుబడులకు దిగి స్టాక్ మార్కెట్‌లో ప్రవేశించవచ్చు. సురక్షితమైన పెట్టుబడుల కోసం ఎఫ్‌డీ, ప్రభుత్వ పథకాలు బెటర్. పోస్టాఫీస్ స్కీములూ లాభదాయకమే. ఐటీ మినహాయింపులూ ఉంటాయి.



# పీవోఎంఐఎస్ భళా

**నెలనెలా** ఆదాయాన్ని ఆశించేవారు, సురక్షిత పెట్టుబడులపట్ల ఆసక్తిగలవారు పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం (పీవోఎంఐఎస్)ను పరిశీలించవచ్చు. ఈ కేంద్ర ప్రభుత్వ పథకం ఆకర్షణీయ వడ్డీరేటును అందిస్తున్నది. అక్టోబర్-డిసెంబర్‌కు 7.40 శాతం వడ్డీరేటు వస్తున్నది. ఇతర చిన్నమొత్తాల పొదుపు పథకాల వడ్డీరేట్ల మాదిరిగానే ఈ పీవోఎంఐ స్కీం వడ్డీరేటును కూడా మూడు నెలలకోసారి సవరిస్తారు. ఇక ఈ పథకం కచ్చితమైన రాబడులను మదుపరులకు అందిస్తుంది. డెట్ ఇన్వెస్ట్‌మెంట్ల కంటే అవి ఉత్తమంగానే ఉంటాయి. స్కీం మెచ్యూరిటీ కాలవ్యవధి ఐదేండ్లు. గరిష్ఠంగా రూ.9 లక్షలు పెట్టుబడిగా పెట్టవచ్చు. ఇద్దరు లేదా ముగ్గురితో కలిసి కూడా స్కీంలో చేరవచ్చు. అప్పుడు పెట్టుబడి పరిమితి రూ.15 లక్షలు. ఇక 10 ఏండ్లు దాటిన పిల్లల పేరుతో కూడా స్కీంను తీసుకోవచ్చు.




# అప్రమత్తత అవసరం

**దేశీయ** స్టాక్ మార్కెట్లలో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. ప్రతికూల పరిణామాల మధ్య మదుపరులు పెట్టుబడుల ఉపసంహరణలకే పెద్దపీట వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 156.61 పాయింట్లు లేదా 0.19 శాతం క్షీణించి 81,224.75 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 110.20 పాయింట్లు 0.44 శాతం పతనమై 24,854.05 దగ్గర ఆగింది. ఈ క్రమంలో ఈ వారం కూడా అమ్మకాల ఒత్తిడికే ఎక్కువగా వీలున్నట్టు అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ద్వితీయ త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను కార్పొరేట్ కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు గత వారం మాదిరే ఈ వారం కూడా మార్కెట్ ట్రేడింగ్‌ను ప్రభావితం చేయనున్నాయి మరి. అందుకే మదుపరులు అప్రమత్తంగా ఉండాలని, ఇన్వెస్ట్‌మెంట్లపై ఆచితూచి స్పందించడం ఉత్తమమని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయం. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిస్థితులు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈసారీ భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. సెల్లింగ్ ప్రెషర్ భారీగా ఉంటే నిఫ్టీకి 24,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,300-25,500 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

### గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.